


# కరపత్రం

SINCE 2014

గురువారం జూలై 24 2025 | సంపుటి :0 | సంచిక :279 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## బీసీ రిజర్వేషన్లపై భాజపాది ద్వంద్వ వైఖరి: సీఎం రేవంత్‌రెడ్డి

»మత ప్రస్తావన లేదు: తాము కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదని సీఎం స్పష్టం చేశారు.

»కులగణన సర్వే వివరాలు: కులగణన సర్వేలో వ్యక్తుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదని, 3.99% మంది తమకు ఏ కులం లేదని చెప్పారని తెలిపారు.

»నిపుణుల నివేదిక: స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే ముందుకు వెళ్తున్నామని చెప్పారు.


»కుట్రలు: బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నవారే సందేహాలు లేవనెత్తుతున్నారని ఆరోపించారు.

»డేటా ప్రదర్శన: కులగణన సర్వే డేటా కావాలంటే ఆయా పార్టీల ముందు, అసెంబ్లీలో ప్రవేశపెడతామని తెలిపారు.



దిల్లీ: కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు రూపొందించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించినట్లు చెప్పారు. బిల్లు ఆమోదానికి కేంద్రంలోని విపక్ష కూటమి నేతలను కూడా కలిసి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్లు చెప్పారు. పేజి 2లో

## బొగత జలపాతం మూసివేత.. అటవీశాఖ నిర్ణయం



హైదరాబాద్: ములుగు జిల్లాలోని వాజేడులో కుండపోత వర్షాలతో బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో పర్యటకుల భద్రత దృష్ట్యా ఈ జలపాతాన్ని తాత్కాలికంగా మూసివేయాలని తెలంగాణ అటవీశాఖ నిర్ణయించింది. ఈ నెల 26 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఈ జలపాతం మూసిఉంటుందని ములుగు జిల్లా ఫారెస్ట్ అధికారి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఇప్పటికే అప్రమత్తమైన అధికారులు.. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సందర్శకులను అనుమతించడంలేదు.

మరోవైపు, ముత్యందార, కొంగల, మామిడిలొద్ది, కృష్ణాపురం జలపాతాలను సైతం శాశ్వతంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. పర్యటకులను ఆయా జలపాతాల వద్దకు అనుమతించబోమని తెలిపారు. ఎవరైనా తమ సూచలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని, పోలీసు కేసు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## తెలంగాణలో పలు జిల్లాలకు అత్యంత భారీ వర్ష హెచ్చరిక




హైదరాబాద్: తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ అత్యంత భారీ వర్ష హెచ్చరిక చేసింది. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కొమురం భీం, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే వీలుందని పేర్కొంది.

పేజి 2లో

## సాధ్యం కానప్పుడు.. రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఎలా అంగీకరించారు?




హైదరాబాద్: భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు బీసీలకు వ్యతిరేకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు భారత రాష్ట్ర సమితి మోకాలడ్డుతోందని విమర్శించారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. తాము పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు భాజపా ససేమిరా అంటోందని.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆ పార్టీకి ఇష్టం లేనట్లుగా ఉందన్నారు.

పేజి 2లో



## భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం

»వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ప్రత్యేక సిబ్బంది ఏర్పాటు

»అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం

»కూకట్‌పల్లిలో భారీగా ట్రాఫిక్ జామ్

రాష్ట్రంలో.. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, కలెక్టర్ దాసరి హరిచందన, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, మెట్రో వాటర్ వార్క్స్, ట్రాఫిక్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు- చేయాలని అధికారులను ఆదేశించారు.

పేజి 2లో

## అసలు ఆ దేశమే లేదు.. భారత్‌లో మాత్రం ఎంబసీ..!



అసలు ఆ దేశమే లేదు.. కానీ ఎంబసీ ఏర్పాటు చేసి ఓ వ్యక్తి జాబ్ రాకెట్ నడుపుతున్నాడు . ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లపై ఎంబసీ స్టిక్కర్లు, దౌత్య పాస్‌పోర్టులు, విదేశీ కరెన్సీ, దేశంలోని ప్రముఖ నేతలతో దిగిన నకిలీ ఫొటోలను వాడుకుంటున్నాడు. చివరకు ఉత్తర్‌ప్రదేశ్ టాస్క్ ఫోర్స్ చేతికి చిక్కాడు. జాతీయ మీడియా కథనాల ప్రకారం..దిల్లీ ఎన్‌సీఆర్‌కు సమీపంలోని గాజియాబాద్‌లో హర్షవర్ధన్ జైన్ అనే వ్యక్తి తాజాగా పోలీసులకు దొరికిపోయాడు. ఆ నగరంలో అతడు విలాసవంతమైన రెండు అంతస్తుల ఇంటిని అద్దెకు తీసుకొని వెస్ట్‌ఆర్కిటికా పేరుతో దౌత్యకార్యాలయాన్ని నడుపుతున్నాడు. అది అంటార్కిటికాలోని ఒక ప్రాంతం.

పేజి 2లో

## ట్రంప్ 25 సార్లు అన్నారు

భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధినేత ట్రంప్ 25 సార్లు చెప్పారని దీనిపై కేంద్రం వివరణ ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. "కేంద్రం ఏమని చెబుతుంది. ట్రంప్ కాల్పుల విరమణ చేయించారనా..? కానీ అలా చెప్పలేరు. అయినా, అదే నిజం. ఇది కేవలం కాల్పుల విరమణ వరకే కాదు. మనం చర్చించాల్సిన చాలా పెద్ద సమస్యలు ఉన్నాయి.. కాల్పుల విరమణ చేయించినట్లు 25 సార్లు ట్రంప్ చెప్పారు. అసలు ట్రంప్ ఎవరు..? అది ఆయన పనికాదు. ప్రధాని సమాధానం ఇవ్వడంలేదు.

పేజి 2లో



# బీసీ రిజర్వేషన్లపై భాజపాది ద్వంద్వ వైఖరి: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో సెప్టెంబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని సీఎం గుర్తుచేశారు. కేంద్రం త్వరగా రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

“భాజపా నాయకత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. ఆ పార్టీ నేతలు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి.. ఇప్పుడు మరో మాట మాట్లాడుతున్నారు. ముస్లింల శాతాన్ని తీసివేయాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు. భాజపా పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా? యూపీ, గుజరాత్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లను ఎందుకు తొలగించడం లేదు? ఆయా రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు తొలగించాకే భాజపా నేతలు తెలంగాణ గురించి మాట్లాడాలి.

**మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు**

కులగణన సర్వేలో వ్యక్తుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదు. 3.99 శాతం మంది తమకు ఏ కులం లేదని చెప్పారు. స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే మేం ముందుకెళ్తున్నాం. బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నవారే సందేహాలు లేవనెత్తుతున్నారు. కులగణన సర్వే డేటా కావాలంటే ఆయా పార్టీల ముందు, అసెంబ్లీలో ప్రవేశపెడతాం. మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు. ముస్లింల పేరుతో మరోసారి భావోద్వేగ రాజకీయాలు చేయాలని భాజపా చూస్తోంది. మూడు రైతు వ్యతిరేక చట్టాల విషయంలో ఏం జరిగిందో అందరూ చూశారు. రైతు చట్టాల రద్దు స్ఫూర్తిగా బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడుతాం.

**దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి**

10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50శాతం నిబంధన దాటిపోయింది. దాని విషయంలో అడ్డురాని నిబంధన బీసీల విషయంలో ఎందుకు వస్తోంది? ఓబీసీలకు న్యాయం చేయాలని భాజపాని కోరుతున్నా. కేంద్ర పదవుల్లో తెలంగాణకు, బీసీలకు అన్యాయం జరుగుతోంది. గతంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేతను తొలగించారు. ఇప్పటికే దత్తాత్రేయను గవర్నర్ పదవి నుంచి తొలగించారు. బీసీ అయిన దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి”అని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## గ్రామపంచాయతీ కార్యదర్శులకు తప్పని ఇబ్బందులు- చెల్పూరి రాము.

**- సిపిఎం మండల కార్యదర్శి**



**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూలై 23,**

ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదని స్వంతంగా ఖర్చు పెట్టుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించాల్సి వస్తుందని మండల సిపిఎం కార్యదర్శి చెల్పూరి రాము. అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో పరిశుద్ధ పనులకు బ్లీచింగ్ పౌడర్, ట్రాక్టర్ డీజిల్, వీధిలైట్లు వెలగకపోయినా కొత్త లైట్లు వేయించడం విద్యుత్ మోటార్లు కాలిపోతే మరమ్మతులు జరిపించాలంటే అందుకు అయ్యే ఖర్చు కార్యదర్శులే భరించాల్సి వస్తుందన్నారు. గ్రామాలలో ఏ సమస్య వచ్చిన పరిష్కారం బాధ్యత కార్యదర్శులకు అప్పగించడంతో నిధులు లేక సొంత ఖర్చులతో పనులు చేస్తూ అప్పుల పాలవుతున్నారన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని కుక్కల బెడద తీవ్రంగా ఉందని అన్నారు. వివిధ గ్రామాలలో మనుషులపై కోతులు, కుక్కలు, దాడి చేయడంతో పాటు గొర్రెలు మేకలను చంపుతున్నాయని కుక్కల బెడద కోతుల బెడదను నివారించాలన్నారు. గ్రామ కార్యదర్శులకు రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్ లు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో అప్పుల పాలయ్యారని వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## బిగ్ బజార్ యజమానిపై కేసు.

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**




మెదక్ నర్సాపూర్ పట్టణంలోని టీజీఎస్ ఆర్టీసీ బస్ స్టాప్ నందు గల పుష్ప బిగ్ బజార్ లో అట్టి షాపు యాజమాన్యం అగు ఇర్ఫాన్ అలీ తండ్రి సలీం అలీ .నర్సాపూర్ టౌన్ . గత కొన్ని రోజులుగా అతని షాప్ నందు మైనర్ బాలికను పెట్టి పనులు చేయిస్తున్నందున, మెదక్ జిల్లా ఎస్పీ . ఆదేశానుసారం ఆపరేషన్ ముస్కాన్ -XI, టీం సభ్యులు రెస్క్యూ ఆపరేషన్లు చేస్తుండగా నర్సాపూర్ లోని బస్ స్టాప్ లో గల పుష్ప బిగ్ బజార్ లో షాపు యాజమాని అగు ఇర్ఫాన్, అతడు షాపు నందు మైనర్ బాలికలను పెట్టి బలవంతంగా పనులు చేపిస్తున్నందున,ఆపరేషన్ ముస్కాన్ టీం ఫిర్యాదు మేరకు నర్సాపూర్ యస్ హెచ్ ఓ అగు కె జగన్నాథం,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## అంగరంగ వైభవంగా బోనాల జాతర

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 23:**



ఓసీపీ-1 ఎస్ అండ్ డి సెక్షన్ లో బోనాల జాతరను బుధవారం అంగరంగ వైభవంగా ఎస్ అండ్ డి సెక్షన్ హెచ్ఓడి నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని సెక్షన్ల హేచ్ఓ డీలు ఇంజనీర్స్, ఎస్ అండ్ డి ఫోర్మెన్స్ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టు పరిశ్రమ శాఖలో రషీద్ చేసిన సేవలు ఎనలేనివి.

**- రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ షేక్ యాస్మిన్ భాష**
**- పదవి విరమణ చేయబోతున్న రషీద్ కు సన్మానం**



**కరపత్రం ప్రతినిధి-హైదరాబాద్:**

రైతులకు అవగాహన కల్పిస్తూ మల్బరి సాగుతో పాటు పట్టుపురుగుల పెంపకం చేపట్టే విధంగా మహమ్మద్ రషీద్ ఎంతో కృషి చేశారని, ఆయన పట్టు పరిశ్రమ శాఖలో చేసిన సేవలు ఎనలేనివని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు. ఈనెల 31న పదవి విరమణ చేయబోతున్న మహమ్మద్ రసీదును బుధవారం హైదరాబాదులోని సెరికల్చర్ కార్యాలయంలో ఉద్యోగులు సిబ్బందితో కలిసి ఆమె ఘనంగా సన్మానించారు. రసీదు విశ్రాంత జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం రషీద్ మాట్లాడుతూ..1985 లో దినసరి కూలీగా చేరి 1989లో టెక్నికల్ అసిస్టెంట్ నుండి టెక్నికల్ అధికారిగా, అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్, సెరికల్చర్ ఆఫీసర్ నుండి 2025 జనవరి లో కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ ఉద్యోగ పదోన్నతులు పొందానని తెలిపారు. ఈనెల 31న పదవి విరమణ ఉన్నందున ఈనెల 27న హనుమకొండ జిల్లాలోని ముల్కనూరులో పదవి విరమణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ అధికారిని మండల లత, హనుమకొండ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ జి. అనసూయ, ఖమ్మం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ ఎర్ర ముత్యాలు, హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ దాసరి దయాకర్ రావు, హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ శక్కరి శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ రాథోడ్ పార్వతి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ జి. నాగరత్న, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసలు ఆ దేశమే లేదు.. భారత్‌లో మాత్రం ఎంబసీ..!

మొదటిపేజీ తరువాయి

ఒక యూఎస్ నౌకాదళ అధికారి దేశంగా ప్రకటించుకున్నాడు.కానీ దీనికి ఎలాంటి గుర్తింపు లేదు. దీని పేరుతో జైన్ విదేశాల్లో పని ఇప్పిస్తానని యువతను నమ్మిస్తూ ఓ జాబ్ రాకెట్ నడుపుతున్నాడు. అలాగే మనీలాండరింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని పోలీసులు అభియోగాలు మోపారు .

యువత అతడిని నమ్మేందుకు పలు జిమ్మిక్కులు ఉపయోగించాడు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ప్రముఖ నేతలతో దిగిన నకిలీ ఫొటోలను వాడుకున్నాడు. 2011లోనూ శాటిలైట్ ఫోన్ కలిగి ఉన్నాడని అతడిపై కేసు నమోదైంది కూడా. తాజాగా ఎంబసీ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ నేపథ్యంలో అతడి కార్యకలాపాలపై అనుమానం వచ్చిన పోలీసులు.. చివరకు నకిలీ ఎంబసీ గుట్టురట్టు చేశారు. వెస్ట్‌ఆర్కిటికాతో పాటు 12 మైక్రోనేషన్ల దౌత్యపాస్‌పోర్టులు, విదేశాంగ శాఖ స్టాంపులున్న దస్త్రాలు, 34 దేశాల స్టాంపులు, రూ.44 లక్షల నగదు, దౌత్య నంబర్‌ప్లేట్లు, ఖరీదైన కార్లను స్వాధీనం చేసుకున్నారు.

**వెస్ట్‌ఆర్కిటికా..అసలు ఉందా?**

2001లో యూఎస్ అధికారి ట్రావిస్ మెక్‌హెన్రీ దీన్ని ప్రకటించాడు. తనను తాను గ్రాండ్ డ్యూక్‌గా ప్రకటించుకున్నారు. అంటార్కిటాలో 6,20,000 చదరపుమైళ్ల మేర తనదే అని చెప్పుకున్నాడు. ఆ దేశానికి 2,536 మంది పౌరులు ఉన్నారని చెప్తున్నా.. అక్కడ ఎవరూ నివసించడం లేదు. అంటార్కిటిక్ ఒప్పందంలోని లొసుగులను ఉపయోగించుకొని దానికి తనను తాను పాలకుడిగా ప్రకటించుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం.. శాంతియుత ప్రయోజనాలు, శాస్త్రీయ పరిశోధనలకు మాత్రమే అంటార్కిటికాను ఉపయోగించుకోవాలి. మిలిటరీ, అణ్వస్త్ర కార్యక్రమాలు, వ్యర్థాలను పడేయడానికి ఏ దేశమూ దానిని వినియోగించుకోకూడదు. ఇవే నిబంధనలు ప్రైవేటు వ్యక్తుల విషయంలో లేదు. ఆ లొసుగునే ట్రావిస్ వాడుకున్నారు. ఈ వెస్ట్‌ఆర్కిటికా ఎంబసీ పేరిట ఏర్పాటు చేసిన ఇన్‌స్టాగ్రాంలో జైన్ తనను తాను ఆ దేశానికి చెందిన సంపన్నుడిగా పేర్కొన్నాడు. 2017 నుంచి దౌత్యకార్యాలయం కార్యకలాపాలు నడుస్తున్నట్లు వెల్లడించాడు. అయితే ఆర్కిటిక్ ఉత్తర ధ్రువంలో ఉండగా అంటార్కిటికాలో ఎలా వచ్చిందన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న.

## ట్రంప్ 25 సార్లు అన్నారు

మొదటిపేజీ తరువాయి

అది వాస్తవం.. ” అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

మరో సారి ట్రంప్ నోట అదే మాట..

భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించామని మంగళవారం కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఈ ఘర్షణలో ఐదు విమానాలు కూలిపోయినట్లు చెప్పారు. కాకపోతే.. ఏ దేశానివో మాత్రం వెల్లడించలేదు. ఈ ఘర్షణ అణు యుద్ధం వరకు వెళ్లేదన్నారు. రెండు వైపులా యుద్ధవిమానాలు కూలిపోయినట్టు పేర్కొన్నారు.

మరోవైపు ఇటీవల జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ భారత్ వైపు నష్టం జరిగినట్టు కనీసం ఓ గాజు పెంకునైనా చూపించాలని సవాల్ చేయడం గమనార్హం.

## రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం: సీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్: నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న 9 మందిని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్‌టసీ, తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

“డగ్స్ కేసులో రవివర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకుని వారి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించాం. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయి. అక్కడ ఉన్న వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తోంది. అతడి నుంచి నిందితులు హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొస్తున్నారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని అరెస్ట్ చేయడంతో ఈ ముఠా గుట్టురట్టయింది. నిందితుల నుంచి రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం. కాటేదాన్‌లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన పవన్ భాటీని కూడా అరెస్ట్ చేశాం. హేమ్‌సింగ్ అనే మరో వ్యక్తితో కలిసి పవన్ భాటీ డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. నిందితులు ముందు జాగ్రత్తగా రివాల్వర్, బుల్లెట్లు కూడా కొనుగోలు చేశారు” అని సీపీ వివరించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి

ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత వారం కురిసిన వర్షాలకు నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయని, మరోసారి అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులతో హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఈ క్రమంలో అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూడు రోజుల పాటు- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ అప్రమత్తం అయ్యారు. నగరంలో ఎక్కడ ఇబ్బంది లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశర చేశారు. హైదరాబాద్‌లో ఉండే 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయని మరోసారి అలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. కాగా, భాగ్యనగరానికి వాతావరణ శాఖ భారీ వర్షసూచన చేసింది. భారీ వర్షం నేపథ్యంలో ఐటీ- ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ కల్పించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు దిశానిర్దేశర చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సహకరించాలని ఐటీ- కంపెనీలను కోరారు పోలీసులు. మరోవైపు.. హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద పో-టె-త్తింది. ఎగువ ప్రాంతాల నుంచి ట్యాంక్‌బండ్‌కు భారీగా వరద చేరుకుంది. జీడిమెట్ల, కూకట్‌పల్లి, పికెట్ నాలాల నుంచి హుస్సేన్ సాగర్‌కు వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. హుస్సేన్ సాగర్ ప్రస్తుత నీటిమట్టం 513. 34 మీటర్లుగా ఉంది. ఫుల్ ట్యాంక్ లెవెల్ చేరువలోకి హుస్సేన్ సాగర్ చేరుకుంది. తూముల ద్వారా నీటిని వదులుతున్నారు అధికారులు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను జీహెచ్ఎంసీ అప్రమత్తం చేసింది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో ఉదయం నుంచి ముసురు వానతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కూకట్‌పల్లిలో ముస్లిం గ్రేవ్ యార్డ్ వద్ద రోడ్డు కొట్టుకుపోయి మ్యాన్‌హోల్ బయటకు తేలింది. దీంతో స్థానికంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వై జంక్షన్ నుంచి కూకట్‌పల్లిలోని భాజపా కార్యాలయం వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఓ అంబులెన్సు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. భరత్‌నగర్ వంతెన పైనా ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

## తెలంగాణలో పలు జిల్లాలకు అత్యంత భారీ వర్ష హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ సూచించింది.

## సాధ్యం కానప్పుడు.. రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఎలా అంగీకరించారు?

మొదటిపేజీ తరువాయి




“బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఎందుకు సాధ్యం కాదు? అలాంటప్పుడు అసెంబ్లీలో భాజపా ఎమ్మెల్యేలు ఎందుకు అంగీకరించారు? బిల్లు ప్రతిపాదన దిల్లీకి చేరేసరికి ఎందుకు మాట మారుస్తున్నారు? భాజపా జాతీయ నాయకత్వం.. తమ అభిప్రాయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నోటితో పలికిస్తూ పలాయనం చిత్తగిస్తోంది. బీసీ బిల్లు కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తాం. ఈ నెల 25న జరగనున్న ఓబీసీల సదస్సులో రాహుల్ గాంధీ బీసీ గొంతుకై నిలవబోతున్నారు. బీసీ వ్యతిరేక పార్టీలైన భాజపా, భారత రాష్ట్ర సమితి నుంచి బీసీలంతా బయటకు రావాలి”అని మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూలై 24 2025

# రాజకీయ కక్షపూరిత కేసులు బహిర్గతం...

- ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించడమే తప్పా..?
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి




**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 23:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాల హరీష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సోషల్ మీడియాలో కేసులు చెల్లవని తెలిసినా కేవలం ప్రజలను భయపెట్టడానికే ఈ చర్యలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా బిజెపి కార్యకర్త గతంలో బండి సంజయ్ పై అనుచిత వాక్యాలు చేశారంటూ చేసిన ఫిర్యాదు పై ఈ నెల 16వ తేదీన గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు నోటీసులు అందజేయగా వాటికి వివరణ ఇచ్చేందుకు పోలీస్ స్టేషన్ కు హరీష్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అసభ్యంగా మాట్లాడినా కేసులు నమోదు చేయలేదు. కానీ, ఇప్పుడు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తేనే కేసులు పెడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని హరీష్ రెడ్డి మండిపడ్డారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి వస్తుందని ధీమా వ్యక్తం చేసిన ఆయన మేము కూడా ఒక బుక్కు పెట్టుకుంటాం... వారి పేరు నమోదు చేసి వడ్డీతో సహా చెల్లిస్తాం అని హరీష్ రెడ్డి హెచ్చరించారు. పోలీసులు విచారణకు పిలిచినప్పుడు తాను హాజరై సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్న ఆయన, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించినందుకే అక్రమ కేసులు పెడుతున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. సోషల్ మీడియా కేసులు చెల్లవని తెలిసిన అక్రమ కేసులు నమోదు చేస్తూ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు. ఇప్పటివరకు హైదరాబాద్, గోదావరిఖనిలో 10 కేసులు నమోదయాయని వీటిని చట్టబద్ధంగా న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

# బీసీ రోడ్డు ప్రనులకు ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు




**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూలై 23**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి 19వ వార్డులో 5 లక్షల రూపాయల సిసి రోడ్డును ప్రారంభించుకోవడం జరిగింది. దేశిని స్వప్న కోటి మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఈ నిధులు ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నిధులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ సహకారంతో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడతల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో నిధులు మంజూరుకు ఇవ్వడం జరిగింది. మా ప్రాంతం ప్రజల తరఫున హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడతల ప్రణవ్ బాబు గారికి ప్రత్యేక ధన్యవాదములు. చాలా కాలం నుండి ఈ ప్రాంత ప్రజలు ఇక్కడ రోడ్డు వేయాలని మా దృష్టికి మా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించారు ఈ రోడ్డుతో ఈ ప్రాంతానికి చాలా సౌకర్యంగా మెయిన్ రోడ్డుకు దగ్గరగా ఉంటుంది ఎమర్జెన్సీ ఉన్నప్పుడు అంబులెన్స్ గానీ కార్లు గాని ట్రాక్టర్లు గాని రావడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. కావున ఈ రోడ్డు మంజూరు పట్ల మా ప్రాంత ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సుంకరి రమేష్ .ఎర్రం సతీష్ రెడ్డి . ఎలగందులశ్రీహరి. పిట్టల రమేష్. ఉడుత వెంకటేష్. సంకిస సురేష్. రాజ్ కుమార్. రామచంద్రం. శ్రీను.ఆడెపు రాయనర్స్. ఎండి ఖాదర్ . ఎండి రహీం.రాజ కొమురయ్య. చక్రపాణి .ఎండీ ఇస్మాయిల్. ఎండీ జావిద్. తదితరులు పాల్గొన్నారు

# అయ్యప్ప దేవాలయానికి దాతల వితరణ..
# 108 పత్రాల వెండి నాగవల్లి,లాకర్ బహుకరణ






**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్: జులై 23**
హుజురాబాద్ పట్టణంలోని నవగ్రహ, సంతోషిమాత సహిత, పంచముఖ ఆంజనేయస్వామి, అయ్యప్పస్వామి దేవాలయానికి ఆలయ చైర్మన్ కొత్త అశోక్ రెడ్డి కూతురు మరియు అల్లుడు కోమల్ల రాధిక - విజేందర్ రెడ్డి దంపతులు దేవాలయంలో గల పంచముఖ ఆంజనేయస్వామికి ఇష్టమైన 108 పత్రాల వెండి నాగవల్లి సమర్పించారు. అలాగే అయ్యప్ప స్వామి దేవాలయానికి లాకర్ (బీరువా) బహుకరించారు. వారికి వారి కుటుంబానికి ఆ ఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి ఆశీస్సులు మరియు దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆలయ నిర్వాహకులు మనస్ఫూర్తిగా దీవించారు.

# ఉచిత బస్సు కార్యక్రమాన్ని వినియోగించుకున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన డి ఎం రవీంద్రనాథ్





**కరపత్రం ప్రతినిధి శంకరపట్నం జులై 23**
కరీంనగర్ జిల్లా కేశపట్నం బస్టాండ్ లో హుజురాబాద్ బస్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయోగపడిందని 2023 డిసెంబర్ 9 నుండి ఇప్పటివరకు తెలంగాణ మహిళలకు 200 కోట్ల ఖర్చుపెట్టి ప్రయాణికులను తమ గమ్యాలకు చేరుస్తూ ఈ సద్వినియోగం చేసుకున్న రాష్ట్ర మహిళా లందరికీ ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేసిన హుజురాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తో పాటు ఈ కార్యక్రమంలో ఏర్పాటుచేసిన సభలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మార్వో సురేఖ ని ఈ కార్యక్రమానికి హాజరైనారు మరి హుజురాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ స్థానిక హై స్కూల్ నుండి మహిళా టీచర్లు వాణి శ్రీవాణి డిపో నుండి టీవీ విద్యాసాగర్ ఉద్యోగులు హాజరై ఈ కార్యక్రమం విజయవంతం చేసినారు

# వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతం..

విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు,విద్యారంగ సమస్యలపై మండలంలోని విద్యా సంస్థల బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు,అనంతరం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు వీరన్న నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగానికి విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు విద్యారంగాన్ని నాశనం చేస్తుందని ఇప్పుడు అధికారంలో ఉన్న పెద్దలు విమర్శించి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని తుంగలో తొక్కినట్లు సమస్యల సుడిగుండంలో నెట్టి వేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఏం అనాలి అని అన్నారు,అలాగే రాష్ట్రంలో ఇప్పటివరకు 8600 కోట్ల పెండింగ్ స్కాలర్ షిప్ సుమారు 70 కోట్ల గిరిజన హాస్టల్ ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలనీ రాష్ట్రంలో అద్దె భవనాలలో నడుపుతున్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు గురుకులాలు సంక్షేమ హాస్టల్ లకు సంత భవనాలు నిర్మించాలని విద్యాధికారుల పర్యవేక్షణ లోపం వలన గ్రామీణ ప్రాంతాలలో విద్యావ్యవస్థ చిన్న భిన్నం అవుతుందని కావున తక్షణమే ఖాళీగా ఉన్న ఎంఈఓ డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు,అలాగే ప్రభుత్వ జూనియర్ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అమలు చేస్తామని వాగ్దానాలు ఈయ్యటమే తప్ప ఆచరణలో పెట్టకపోవడం దురదృష్టకరమని ప్రభుత్వ పెద్దలకు విద్యావ్యవస్థను బలోపేతం చేయడంపై ఆలోచన లేనట్లుగా ఉందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయకుంటే అలాగే బకాయిలో ఉన్న స్కాలర్షిప్ మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలను మంత్రులను అడ్డుకొని ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

# వాడపల్లి శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాలు



**కొత్తపేట (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 24వ తేదీ అనగా గురువారం మొదలు 28వ తేదీ సోమవారం వరకు ఐదు రోజుల పాటు ఆండాళ్ తిరునక్షత్ర ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో ద్రవిడ వేద పారాయణం, ప్రాకారోత్సవం, తీర్థ ప్రసాదాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

# వాడపల్లిలో సౌకర్యాల మెరుగుదల



**కొత్తపేట (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
కోనసీమ తిరుమల గా ప్రఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలను పెంచుతున్నారు. రూ.200, రూ.50, ఉచిత క్యూలైన్ల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలోపల ప్రధాన దర్శన మార్గం వద్ద ద్వారాలను వెడల్పు చేసే పనులు చేపట్టారు. తద్వారా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పనులన్నింటినీ బుధవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు దగ్గరుండి పర్యవేక్షించారు.

# ఆకుల రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి నేతలు

**రావులపాలెం గోపాలపురం(ఏపీ) కరపత్రం ప్రతినిధి**




టిడిపి రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ జన్మదిన వేడుకలు రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలో కాపు కళ్యాణ మండపం నందు ఘనంగా జరిగాయి.అభిమానులు. పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు అధిక సంఖ్యలో వచ్చి ఆకుల రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.సుదీర్ఘకాలంగా రాజకీయ నేతగా కొనసాగుతూ వస్తున్న ఆకుల రామకృష్ణ ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కాపు సామాజిక వర్గ నేతగా కాపు సంక్షేమానికి పాటుపడ్డారు.మిత్రుడు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో చేదోడు వాదోడుగా ఉంటూ నియోజకవర్గంలో ఆయనతో కలిసి పనిచేస్తున్నారు.తన మన అనే భేదం లేకుండా అందరినీ ఆప్యాయతగా పలకరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రత్యర్థిని కూడా తన పలకరింపుతో దరికి చేర్చుకునే మనస్తత్వం కలిగి ఉండి అందరికీ చేరువుగా ఉన్నప్పటికీ ఆయనకి ఎందుకో పదవి చేరువుకాలేదు. మిత్రుడు నియోజకవర్గ ఎమ్మెల్యే సత్యానందరావు ప్రోద్బలం సహాయ సహకారాలు ఉన్నప్పటికీ ఎందుకనో పదవి ఆయనకు దూరంగా ఉంటూ వస్తుంది. ఆయన అభిమానులకు ఆయనకు పదవి వస్తే మరింతగా బాగుంటుంది అనే వారికి కాస్తంత కలవరపరుస్తుంది.చింతగా ఉంటుంది.కలవరపాటును చింతను తొలగిస్తూ ఆయనకు త్వరలోనే చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎమ్మెల్యే సత్యానందరావు ప్రొద్బలంతో మంచి పదవి అలంకరిస్తారని కోరుకుంటున్నాము.

# మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన మోడల్ స్కూల్ చైర్మన్

లక్కిరెడ్డిపల్లి మండలంలోని మోడల్ స్కూల్ నందు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నాణ్యతను పాఠశాల చైర్మన్ యనమల విశ్వనాథ్ పరిశీలించి విద్యార్థులకు సరైన పోషకాహారం అందించాలని, నాణ్యతలో, శుభ్రతలో రాజీ పడవద్దని వంట యాజమాన్యానికి సూచించడం అయినది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో సన్న బియ్యం భోజనం, వారానికి ఐదుగుడ్లు మరియు వారానికి మూడు చిక్కీలు, వారానికి మూడు రోజులు రాగిజావ అందించడం జరుగు తుంది.

# 20 మంది బాధితులకు 25.30లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- **క్యాంప్ కార్యాలయంలో అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులను అందించిన మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ......**

బుధవారం రోజు ఉదయం రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అనారోగ్య బాధితులు వాళ్ల యొక్క ఆసుపత్రి ఖర్చులకు గాను ఎంతో ఖర్చు చేసి నిసహాయ స్థితిలో ఉండగా వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులు మంజూరవుగా రాయచోటి నియోజకవర్గం నుండి 20 మంది లబ్ధిదారులకు 25.30 లక్షల రూపాయల చెక్కులను బాధితులకు అందజేయడం జరిగింది...

# రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్,వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త పాఠశాలు,జూనియర్ కళాశాలల బంద్ రామగుండం నియోజకవర్గంలో విజయవంతం అయిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, వెంటనే విడుదల చేయాలని,

గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని, మెస్ కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని, విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని, ఇంటర్ కళాశాలలో



మధ్యాహ్న బోజన పథకాన్ని అమలు చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చెయ్యాలని, ప్రైవేట్,కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత బస్ పాస్ లు ఇవ్వాలని, నూతన జాతీయ విద్య విధానం (ఎన్ఈపీ 2020) తెలంగాణలో అమలు చెయ్యకుండా అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలని.

ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి విద్యారంగ సమస్యను పరిష్కరించాలని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి అందాల పోటీల మీద ఉన్న సోయి విద్యార్థుల భవిష్యత్తు మీద లేక పాయే అని, ఆయన విమర్శించారు. పెండింగులో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్స్ను వెంటనే విడుదల చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ కు సహకరించి, విజయవంతం చేసిన విద్యాసంస్థలకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి డివైఎఫ్ఐ యువజన సంఘం సంపూర్ణ మద్దతు తెలిపి జిల్లా కార్యదర్శి కొంటూ సాగర్ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోడిసెల ప్రణీత్, అభినయ్, రాకేష్ ప్రకాష్, తరుణ్ యూసఫ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్య సంస్థల బంద్ విజయవంతం

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూలై 23**

ఏఐఎస్ఎఫ్ , వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం హుజురాబాద్ మండల వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో బంద్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల అనేకమైనటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దానిలో భాగంగా గత కొన్ని నెలలుగా కొన్ని రోజులుగా జరుగుతున్నటువంటి ప్రభుత్వం ఇప్పటి వరకు కూడా పట్టించుకోకుండా



నిమ్మకు నీరు ఎత్తైనటువంటి పరిస్థితి ఉందని, అదే విధంగా ఫుడ్ పాయిజన్ తో చనిపోయినటువంటి విద్యార్థులను వారి కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కనీసం చదువుకోవడానికి తరగతి గదులు, మరుగుదొడ్లు శు భ్రంగా లేవని, మధ్యాహ్న భోజనం ఆరు బయట చేయడంతో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులకు అనేక రకాలైనటువంటి సౌకర్యాలు కల్పిస్తాం, హాస్టల్ లో ఏర్పాటు చేస్తామని చెప్పి నమ్మించి విద్యార్థులను మోసం చేసినటువంటి ఈ ప్రభుత్వాన్ని భవిష్యత్తులో టిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్, మండల నాయకులు రాహుల్,గణేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి

**కరపత్రం ప్రతినిధి వరంగల్ జులై 23**

వరంగల్ రైతు డిక్లరేషన్ తో రైతులకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ విస్మరించింది...కాంగ్రెస్ రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని , రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ బిజెపి కిసాన్ మోర్చా కరీంనగర్ జిల్లా ఇన్చార్జి , రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ , జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రోజున జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా నేతలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో , వరంగల్ రైతు డిక్లరేషన్ తో రైతులకిచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచిపోయిందని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలన్నీ బేషరతుగా అమలు చేయాలని ,



వరంగల్ రైతు డిక్లరేషన్ లో పేర్కొన్న అంశాలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.2 లక్షల రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయాలని, పది రకాల పంటలకు వరి, మొక్కజొన్న, కందులు , సోయాబీన్ , పత్తి , మిర్చి , పసుపు , ఎర్రజోన్న , చెరుకు , జొన్న పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలని , రైతు భరోసా ఎకరాకు 15 వేలు చెల్లించాలని, రైతు భరోసాను కౌలు రైతులకు వర్తింపజేయాలని , వ్యవసాయ కూలీలకు 12 వేలు చెల్లించాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని, సబ్సిడీపై రైతులకు వ్యవసాయ యాంత్రిక పరికరాలు అందించాలని, పండ్ల తోటను ఆదుకోవాలని , ప్రతి జిల్లాలో విజిలెన్స్, మానిటరింగ్ విభాగం ఏర్పాటుచేసి నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి., జిల్లా ఉపాధ్యక్షులు బోనాల మోహన్, మహేందర్ రెడ్డి, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

**- సమస్యల సాధనకు మూడు దశల ఉద్యమం**
**- తహసిల్దార్ కు మెమోరండము సమర్పించిన ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట:- జూలై 23**

దశబ్ద కాలంగా ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు అనేకం పెండింగ్లో ఉన్నప్పటికిని ప్రభుత్వము స్పందించకపోవడం వలన ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు జే.ఏ.సీగా ఏర్పడి ప్రభుత్వానికి ఎన్నోసార్లు వినతి పత్రాలు సమర్పించిన ప్రభుత్వము నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వలన తిరిగి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ మూడు దశల ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులకు రావలసిన మెడికల్ బిల్లులు జిపిఎఫ్ బిల్లులు పెండింగ్లో ఉండి ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వము పట్టించుకోకపోవడం శోచనీయమని



వెంటనే పెండింగ్ బిల్లులన్నింటినీ క్లియర్ చేయాలని కరీంనగర్ జిల్లా డీటీఎఫ్ అధ్యక్షులు ఆవాల నరహరి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై ఉపాధ్యాయుల పోరాట కమిటీ మూడు దశల పోరాటాన్ని చేపట్టినదని ఆగస్టు 23,24 తారీఖులలో మండల తాసిల్దార్ల ద్వారా ముఖ్యమంత్రి కి వినతి పత్రం సమర్పించడం. ఆగస్టు 1వ తారీఖున జిల్లా కేంద్రాలలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం. ఆగస్టు 23న రాష్ట్రస్థాయిలో మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహించడం కార్యక్రమాలను చేపట్టిన దృష్ట్యా ఉపాధ్యాయ సంఘాలన్నీ ఈ ధర్నాలో పాల్గొంటూ మద్దతు తెలిపాలని, సమస్యల పరిష్కారం కొరకు చేసే పోరాటంలో అందరూ పాల్గొనాలని, టి.పి.టి.ఎఫ్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి అవినాష్ ఉపాధ్యాయ మిత్రులను కోరినారు. జమ్మికుంట మండల తాసిల్దార్ కు మెమొరండం సమర్పించిన ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి.డిటిఎఫ్ మండల అధ్యక్షులు బి.వేణుమాధవ్ జనరల్ సెక్రెటరీ రాజేందర్ టి.పి.టి.ఎఫ్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి అవినాష్ టి. పి.టి.ఎఫ్ జమ్మికుంట మండల జనరల్ సెక్రెటరీ కుమారస్వామి పోతుల రాజయ్య జి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కార్డు పునరుద్ధరణకు చివరి అవకాశం

**- ఆర్జీ 1 పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 23:**



సింగరేణి విశ్రాంత కార్మికులు, వారి భార్యలు మెడికల్ కార్డు పునరుద్ధరణ చేయించుకొనేందుకు చివరి అవకాశం కల్పిస్తున్నట్లు అర్జీ 1 ఏరియా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది నవంబరులో ఉద్యోగులు లైవ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు అర్జీ 1 ఏరియాలో 494 మంది అందజేయలేదన్నారు. పాక్షికంగా లైవ్ సర్టిఫికెట్ సమర్పించిన ఉద్యోగులు 745 మంది అని తెలిపారు. కార్డు రెన్యువల్ చేయించుకోకపోతే వారికి వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. తక్షణమే సంబంధిత ధ్రువపత్రాలను ఆన్ లైన్లో సమర్పించి కార్డు పునరుద్ధరణ చేయించుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం అర్జీ 1 ఏరియా పర్సనల్ డిపార్ట్ మెంట్ లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఒక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన ఆరుగురిని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని, వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరిచారు. ఐదుగురికి రూ.10 వేల జరిమానా విధించారు. ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్న రెండవసారి పట్టుబడిన బొంకురి శ్యామ్ సుందర్ కు మూడు రోజుల జైలు శిక్ష విధించారు. కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.

## ఐఎన్టియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాబర్ సలీం పాషా



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

పెద్దపల్లి ఐఎన్టియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాబర్ సలీం పాషా నియమితులయ్యారు. రాష్ట్ర కార్మిక గనుల శాఖ మాత్యులు వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా బాబర్ సలీం పాషా తీసుకున్నారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర కమిటీ కార్యదర్శి గుమ్మడి కుమార్ స్వామి, జిల్లా అధ్యక్షులు భూమాల చందర్, మాజీ కార్పొరేటర్ దుబాసి మల్లేష్, కల్వల సంజీవ్, నర్సింగ్ దొర, మధు గౌడ్ దీపక్ కిషోర్, శ్రావణ్ లకు బాబర్ సలీం పాషా కృతజ్ఞతలు తెలిపారు.

## లోతట్టు ప్రాంతాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్.. మహమ్మద్ అయాజ్



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 23**



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి, పిట్టలవాడ, క్రిష్ణ కాలనీ, అంబేద్కర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ లోతట్టు ప్రాంతాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ సిడిఎంఏ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మే, జూన్ నెలలో డ్రైన్ లోని షిల్ట్ ను ముందుగానే తొలగించడం జరిగిందన్నారు. రానున్న మూడు రోజులు వర్షాలు అధికంగా ఉన్నందున మున్సిపల్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మున్సిపల్ సిబ్బందిని మూడు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అత్యవసరమైన సమయంలో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్స్ పెక్టర్ మహేష్, ఈ ఈ శ్రీ కాంత్, మున్సిపల్ జవాన్లు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.